నిబంధనలు అతిక్రమిస్తే నాన్‌బెయిల్‌బుల్ కేసులు

ఎస్‌పి అజిత వేజెండ్ల

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఓట్ల లెక్కింపు సమయంలో ఎన్నికల నియమావళిని ఎవరైనా అతిక్రమిస్తే నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక బివి.రాజు విగ్రహం వద్ద పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఎస్‌ఆర్‌కెఆర్ కళాశాల, బివి.రాజు కళాశాలల వద్ద నాలుగంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఐడి కార్డు ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ధాన్యం కొన్నారు.. డబ్బులు మరిచారు..!

రెండు జిల్లాల్లో దాదాపు రూ.1100 కోట్లు బకాయి

పశ్చిమలో రూ.850 కోట్లుపైనే, ఏలూరు జిల్లాలో రూ.242 కోట్లు

ఏప్రిల్ 28 తర్వాత చిల్లిగవ్వ చెల్లిస్తే ఒట్టు

తెచ్చిన అప్పలకు వడ్డీ తడిసిమోపెడు

ట్రాక్టర్, కోతమిషన్, కూలీలకు డబ్బుల్విలేని దుస్థితి

'ఏలూరు రూరల్ మండలంలోని సుంకరవారితోటకు చెందిన కౌలురైతు బైరెడ్డి లక్ష్మణరావు పదెకరాల ధాన్యం మే 3, 4 తేదీల్లో విక్రయించారు. రూ.6.25 లక్షల సొమ్ము రావాల్సి ఉంది. దాదాపు నెల గడుస్తున్నా ఇప్పటి వరకూ చిల్లిగవ్వ సొమ్ము జమ కాలేదు. కోత మిషన్లకు, కూలీలకు, సాగుకు తెచ్చిన అప్పలకు సంబంధించిన ఒత్తిళ్లు భరించలేని పరిస్థితి నెలకొంది. దీంతో దిక్కుతోచని పరిస్థితుల్లో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.'

'ఏలూరు రూరల్ మండలానికి చెందిన మరో రైతు చిన్ని పోతురాజు మే మొదటివారంలోనే 480 సారలు ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించారు. రూ.3.50 లక్షల సొమ్ము రావాల్సి ఉంది. అదిగో ఇదిగో అనడం మినహా ఒక్క రూపాయి జమకాలేదు. సాగు కోసం చేసిన అప్పల ఒత్తిడి పెరిగిపోతుంది. ఇదేం దారుణం' అంటూ ఆ రైతు గగ్గోలు పెడుతున్నాడు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న రైతులు లక్ష్మణరావు, చిన్ని పోతురాజులే కాదు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ధాన్యం విక్రయించిన వేలాది మంది రైతుల పరిస్థితి ఇదేవిధంగా ఉంది. ధాన్యం కొన్నారు.. డబ్బులు మరిచారు అనే చందంగా పరిస్థితి తయారైంది. ధాన్యం సొమ్ము జమకాక రైతులు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. తొలుత ధాన్యం విక్రయించిన వారం రోజుల్లోపే సొమ్ములు జమైన పరిస్థితి ఉంది. ఏప్రిల్ 28వ తేదీ తర్వాత ధాన్యం సొమ్ము జమ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. సాగు కోసం తెచ్చిన పెట్టుబడులకు వడ్డీలు తడిసి మోపెడవుతున్నాయి. కోత మిషన్, ట్రాక్టర్ కిరాయిలు, కూలీలకు ఇచ్చేందుకు సైతం చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి నెలకొంది. పంట చేతికొచ్చి నెలపైనే గడిచిపోవడంతో అప్పుల వాళ్ల ఒత్తిడి మరింత పెరిగిపోయింది. దీంతో ముఖ్యంగా కౌలురైతులకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ధాన్యం సొమ్ములు ఇవ్వండి మహాప్రభో అంటూ రైతులు వేడుకోవాల్సిన దీనస్థితి నెలకొంది. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు రబీలో వరిసాగు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో రబీలో 7.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు రచించారు. ఇప్పటి వరకూ 6.34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. ఇప్పటి వరకూ రూ.400 కోట్లు వరకూ మాత్రమే రైతులకు ధాన్యం సొమ్ము జమయ్యింది. ఇంకా రూ.850 కోట్లకుపైగా ధాన్యం సొమ్ము రైతులకు అందాల్సి ఉంది. కొనుగోలు చేసిన ధాన్యంలో 40 శాతం మాత్రమే చెల్లింపులు జరిగాయి. ఇంకా 60 శాతం సొమ్ము చెల్లించాల్సి ఉంది. ధాన్యం సొమ్ము ఎప్పటికి జమ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలో రబీలో 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటి వరకూ 120 రైతుభరోసా కేంద్రాల ద్వారా రెండు లక్షల 161 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. 17,432 మంది రైతుల నుంచి రూ.439.01 కోట్లు విలువ చేసే ధాన్యం కొనుగోలు చేయగా ఇప్పటి వరకూ చెల్లించిన సొమ్ము కేవలం రూ.196.09 కోట్లు మాత్రమే. ఇంకా చెల్లించాల్సిన ధాన్యం సొమ్ము రూ.242.10 కోట్లు ఉంది. కొనుగోలు చేసిన ధాన్యంలో కేవలం 44 శాతం సొమ్మును మాత్రమే ఇప్పటి వరకూ చెల్లించిన పరిస్థితి ఉంది. ధాన్యం విక్రయించిన నెలరోజులు దాటిపోయినా ఇప్పటికీ సొమ్ము చెల్లించకపోవడంపై రైతుసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులతో ఆందోళనలకు సైతం దిగుతున్నాయి. ప్రభుత్వం వెంటనే రైతులకు ధాన్యం సొమ్ము చెల్లించాలని అంతా డిమాండ్ చేస్తున్నారు. ధాన్యం సొమ్ము కోసం రైతులు పౌరసరఫరాలశాఖ అధికారులను కలవగా ప్రభుత్వం అప్పు కోసం చూస్తుందని, ఆ సొమ్ము వచ్చిన వెంటనే ఒకటి, రెండురోజుల్లో చెల్లింపులు జరుగుతాయని చెప్పి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. రైతుల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తుండటంతో సమాధానం చెప్పేందుకు పౌరసరఫరాలశాఖ, వ్యవసాయశాఖ అధికారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే రైతులకు ధాన్యం సొమ్ము అందించకపోతే అన్నదాత ఇబ్బందులు వర్ణనాతీతంగా మారనున్నాయి.

కౌంటింగ్ కేంద్రాలకు సులువుగా చేరేలా చర్యలు

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

కౌంటింగ్ సిబ్బంది, పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లు సులువుగా ఓట్ల లెక్కింపు కేంద్రాలకు చేరుకోవడానికి పక్కా ప్రణాళికను సిద్ధం చేసి అమలుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక వశిష్ఠ సమావేశ మందిరంలో ఆయన జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్లతో కలిసి ఆర్‌ఒలు, డిఎస్‌పిలతో సమావేశమై కౌంటింగ్ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవడానికి రూట్‌మ్యాప్‌లను రూపొందించి, పార్కింగ్ ప్రదేశాల సమాచారాన్ని అందించాలన్నారు. పార్కింగ్, కౌంటింగ్ కేంద్రాలకు చేరుకునే మార్గాలపై కౌంటింగ్ సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. కొవ్వాడ అన్నవరం సెంటర్‌కు చేరుకున్న కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లకు విష్ణు కాలేజీ మెయిన్ గేటు వరకు చేరుకోవడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. మీడియా ప్రతినిధులు కూడా ఇవే వాహనాల్లో మీడియా సెంటర్‌కు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజీ కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవడానికి నాగరాజు మాల్, ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద బస్సులు ఏర్పాటు చేశామని, ఆయా ప్రదేశాల నుండి నడిచి వచ్చినా ఏడెనిమిది నిమిషాలు మాత్రమే పడుతుందని అన్నారు. పోలీస్ సెక్యూరిటీ కల్పించిన పోటీలో ఉన్న అభ్యర్థులకు, రిటర్నింగ్ అధికారులకు మాత్రమే కౌంటింగ్ సెంటర్ వరకు వాహనాల అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రానికి చేరుకునే మార్గంలో రెండు ప్రదేశాల్లో చెకింగ్ ఉంటుందని, అలాగే అలాగే మొబైల్‌ని కూడా కచ్చితంగా డిపాజిట్ చేయాలని తెలిపారు. అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేసి ఓట్ల లెక్కింపుకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా విజయవంతంగా పూర్తిచేయడానికి కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఎస్‌పి అజిత వేజెండ్ల మాట్లాడుతూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోలీసు అధికారులు ముందుకెళ్లాలన్నారు. కౌంటింగ్ రోజున గెలిచిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలకు, బాణాసంచా కాల్చడానికి అనుమతుల్లేవని స్పష్టం చేశారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు సానుకూలంగా పరిష్కరించడానికి కృషి చేసి కౌంటింగ్‌కు ఆటంకం లేకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పి వి.భీమారావు, జాయింటు కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య, డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు, రిటర్నింగ్ అధికారులు, డిఎస్‌పిలు పాల్గొన్నారు.

చేపల వేట నిషేధ భృతి ఇవ్వాలని ఆందోళన

ప్రజాశక్తి - నరసాపురం

నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

మత్స్యకారులందరికీ చేపల వేట విరామ భృతి అందజేయాలని మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని వేములదీవితూర్పులో ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మత్స్యకారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తీరగ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. చేపల వేట నిషేధ సమయంలో రూ.20 వేల నగదు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు చౌకదుకాణం ద్వారా అందించాలన్నారు. కొత్తగా మోటార్ బోట్లు కొనుక్కున్నా లైసెన్సులను తక్షణమే ఆన్‌లైన్ చేయాలన్నారు. ఆయిల్ సబ్సిడీ రూ.20కు పెంచాలని, నేరుగా బోటు యజమాని ఖాతాలో జమచేయాలని కోరారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

ఆచంట రిటర్నింగ్ అధికారి స్వామినాయుడు

ప్రజాశక్తి - ఆచంట

చిట్‌చాట్

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు తెలిపారు. ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆచంట నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 14 రౌండ్లలో పూర్తవుతుందన్నారు. అనంతరం ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. భీమవరం విష్ణు క్యాంపస్‌లో బి.సీత పాలిటెక్నిక్ కళాశాల రెండో అంతస్తులో రూమ్ నెంబర్.310 సెమినార్ హాల్లో, పార్లమెంటుకు సంబంధించి రూమ్ నెంబర్ 313 సెమినార్లో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపులో ఒక్కో టేబుల్ వద్ద ఒక సూపర్‌వైజర్, సహాయకుడు, మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. రౌండ్లవారీగా ఏ ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయో తెలిపేందుకు బోర్డును సిద్ధం చేశామన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఇవిఎంలను తాకే వీల్లేకుండా ప్రత్యేకంగా మెస్ ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్‌రూమ్ నుంచి కౌంటింగ్ హాలుకు ఇవిఎంలు, వివి ప్యాట్లు తరలించడానికి ప్రత్యేక ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు సిబ్బందికి, కౌంటింగ్ ఏజెంట్లకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. మరో నాలుగు టేబుల్స్ పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి అసెంబ్లీ కౌంటింగ్ హాల్లో ఉంటాయన్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రారంభమవుతుందని, అర గంట తరువాత 14 టేబుల్స్‌కు పోలింగ్ స్టేషన్లవారీగా ఇవిఎంల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రానికి ఏజెంట్లు ఉదయం ఆరు గంటలకు చేరుకోవాలని, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని అన్నారు. సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్ ప్రక్రియ సాగుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు, ఏజెంట్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో 187 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,80,017 మంది ఓటర్లు ఉండగా పురుషులు 88,881 మంది, మహిళలు 91,132 మంది, ఇతరులు నలుగురు ఉన్నారని తెలిపారు. మొత్తం 1,49,048 ఓట్లు పోలవ్వగా పురుషులు 73,024, మహిళలు 76,022 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని వివరించారు. మొత్తం 82.80 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి 1517 ఓట్లు పోలయ్యాయన్నారు. ఆచంట నియోజకవర్గం నుంచి తొమ్మిది మంది అభ్యర్థులు బరిలో నిలిచారన్నారు. నియోజవర్గంలో 187 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ఓట్ల లెక్కింపు పెనుమంట్ర మండలం సోమరాజు ఇల్లింద్రపర్రు నుంచి ప్రారంభమై పెనుగొండ, పోడూరు, ఆచంట మండలాల వారీగా సాగుతుందన్నారు. చివరిగా ఆచంట మండలం అయోధ్యలంక పంచాయతీ పరిధిలోని పుచ్చల్లంక పోలింగ్ బూత్‌తో కౌంటింగ్ పూర్తవుతుందన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటివారిపైనైనా కేసులు నమోదు చేసి అరెస్టు చేసి జైలుకు పంపుతామన్నారు. అభ్యర్థి లేదా వారి ఏజెంట్ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే వారిని కౌంటింగ్ హాల్ నుంచి బయటకు పంపిస్తామని స్పష్టం చేశారు.

'పది'లో అద్భుత ఫలితాలు సాధించాం

జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఇటీవల విడుదలైన 2024 పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా అద్భుతమైన ఫలితాలు సాధించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ గతేడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 65.9 శాతం విజయం సాధించగా, ఈ ఏడాది గతం కంటే ఎక్కువగా 81.83 శాతం సాధించామన్నారు. ఇదంతా ఒక ప్రణాళికగా ఉపాధ్యాయులంతా ఎంతో శ్రమించి విద్యార్థులకు విద్యాబోధన చేయడంతోనే సాధ్యమైందన్నారు. జిల్లాలో 20 వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారని, వారిలో 12,900 మంది ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యారని, మూడు వేల మంది సెకండ్ క్లాస్‌లో పాసయ్యారని తెలిపారు. అలాగే థర్డ్ క్లాస్ కూడా ఎక్కువగా సాధించాలని తెలిపారు. ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అదనపు సమయం విద్యాబోధన చేసి మంచి ఫలితాలు సాధించే విధంగా కృషిచేసిన ఉపాధ్యాయులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. విద్యతోనే దేశ భవిష్యత్తు అన్నారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు గురువులు, తల్లిదండ్రుల సూచనల మేరకు మంచి కళాశాలలో చేరి ఉన్నత చదువులు చదివి ఇటు గురువులకు, తల్లిదండ్రులకు సొంత ఊరికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు.

అంతర్ జిల్లా దొంగలు అరెస్టు

రూ.47.22 లక్షలు విలువైన సొత్తు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - తణుకు

వివరాలను వెల్లడిస్తున్న సిఐ జివివి నాగేశ్వరరావు

వరుస చోరీలకు పాల్పడిన అంతర్‌జిల్లా ముద్దాయిలను తణుకు రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితుల నుండి సుమారు రూ.47.22 లక్షలు విలువైన బంగారు, వెండి ఆభరణాలు, హీరోహోండా మోటారు సైకిల్, సుజుకీ యాక్సెస్ స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు. తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీకి సంబంధించిన వివరాలను రూరల్ సిఐ జివివి.నాగేశ్వరరావు వెల్లడించారు. భీమవరంలోని గునుపూడి కళ్యాణ మండపం ఎదురుగా బ్రాహ్మణవీధికి చెందిన పందిరి వెంకటనారాయణ, తణుకు పట్టణం, అజ్జరం రోడ్డులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన నగరపు ఈశ్వరరావు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలను వృత్తిగా చేసుకున్నారని వివరించారు. ఈ క్రమంలోనే తణుకు సర్కిల్ పరిధిలోని ఇరగవరం, తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్, పాలకోడేరు, పెనుమంట్ర, ఏలూరు జిల్లా గణపవరం, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం, పెరవలి, కోనసీమ జిల్లా అంబాజీపేట, రావులపాలెం, అయినవల్లి, రాజోలు, కొత్తపేట, అమలాపురం రూరల్ పోలీసు స్టేషన్ల పరిధిలో గత ఆరు నెలల వ్యవధిలో 15 నేరాలకు నిందితులు పాల్పడినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుండి 600 గ్రాముల బంగారు ఆభరణాలతోపాటు 13 కిలోల వెండి ఆభరణాలు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పాత నేరస్థుడైన పందిరి వెంకటనారాయణకు ఒక హత్య కేసులో జైలుకు వచ్చిన నగరపు ఈశ్వరరావుతో పరిచయం ఏర్పడిందని తెలిపారు. తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. తణుకు అజ్జరం రోడ్డులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన తణుకు రూరల్ సిఐ జివివి.నాగేశ్వరరావు, ఎస్‌ఐ కె.చంద్రశేఖర్, ఇరగవరం ఎస్‌ఐ డి.ఆదినారాయణ, సిబ్బంది ఎం.యల్లారావు, ఎం.నాగశ్రీనివాస్, షేక్ అన్వర్, మలక శ్రీనివాస్, ఎం.లక్ష్మణరావు, కె.రుద్రేశ్వరరావులను జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల, తాడేపల్లిగూడెం డిఎస్‌పి డిఎస్‌ఆర్‌విఎస్.మూర్తి అభినందించారు.

నిప్పుల కుంపటి

ఎండ వేడిమికి విలవిల్లాడుతున్న జనం

ప్రజాశక్తి - నరసాపురం

నిర్మానుష్యంగా 216 జాతీయ రహదారి

ఎండలు మండి పోతున్నాయి. రోహిణీ కార్తె నేపథ్యంలో నిప్పుల కుంపటిగా మారింది. రోడ్లన్నీ నిర్మాను ష్యంగా ఉన్నాయి. మండలంలోని సీతారాంపురం గ్రామంలో నిత్యం రద్దీగా కనిపించే 216 జాతీయ రహదారిపై జనాల్లేక నిర్మానుష్యంగా కనిపించింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. అత్యవసర అయితే తప్ప ప్రజలెవరూ బయటకు రావడం లేదు. వ్యాపారాలు లేకపోవడంతో దుకాణాల సైతం మూసివేస్తున్నారు. ఎండ వేడిమిని తట్టుకోలేక ప్రజలు శీతల పానీయాల వైపు పరుగులు తీస్తున్నారు. జ్యూస్, ఐస్ క్రీమ్ పార్లర్లు రద్దీగా కనిపిస్తున్నాయి.

క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ అండ్ కస్పాండెంట్ రామకృష్ణ నిశాంత్ వర్మ

తమ కళాశాలలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ తెలిపారు. కళాశాలలో నెల రోజులపాటు సబ్ జూనియర్ స్థాయిలో విద్యార్థులకు షటిల్ బ్యాడ్మింటన్, చెస్‌లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.హరిమోహన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిశాంత్ వర్మ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా తమ కళాశాలలో వేసవిలో విద్యార్థులకు క్రీడల్లో ఉచితంగా శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్రత్యేకంగా కోచ్‌లను కూడా ఏర్పాటు చేసి శిక్షణ అందించడం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగం కలుగుతుందన్నారు. భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ సబ్ జూనియర్ స్థాయిలో కూడా విద్యార్థులు నెల రోజులపాటు క్రమం తప్పకుండా శిక్షణ పొందడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. క్రీడల పట్ల వారికి ఉన్న ఆసక్తికి ఇది నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా షటిల్ బ్యాడ్మింటన్ కోచ్ కిరణ్ కుమార్‌వర్మ, చెస్ కోచ్ ఐ.ఉమామహేశ్వరి, ఎస్‌ఎస్.చంద్రశేఖర్‌ను మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎన్.లక్ష్మి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఇన్‌ఛార్జి డాక్టర్ పి.భువనేశ్వరి, ఇంజినీరింగ్ కెమిస్ట్రీ హెడ్ డాక్టర్ పి.భవాని, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్.హరిమోహన్, జి.సారిక పాల్గొన్నారు.

చెరువులో నిర్ణీత లోతు వరకే పూడిక తొలగించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

వాహనాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

మొగల్తూరులోని నాగదేవత ఆలయం వద్ద ఉన్న పంచాయతీ చెరువులో నిర్ణీత లోతులో పూడిక తొలగించాలని మత్స్య సహకార సంఘ అధ్యక్షుడు మోకా నాగశంకరం, కార్యదర్శి పొన్నాల ముత్యాలు డిమాండ్ చేశారు. చెరువులోని ఇసుక తరలిస్తున్న వాహనాలకు శుక్రవారం రాత్రి అడ్డుగా నిలబడి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సుమారు పది అడుగుల లోతులో పూడిక తొలగిస్తున్నారని, దీంతో తాము చెరువులో చేపలు పట్టుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పంచాయతీ అధికారులు ఇసుక తరలింపు పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్లాటి మంగరాజు బర్రె వెంకన్న, మల్లాడి వెంకటేశ్వరరావు, కొల్లాటి సింహాచలం, తిరుమల సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రావీణ్యత ఉంటేనే గుర్తింపు

కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఉద్యోగ విరమణ సభలో కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

లీలాశంకర్ సత్య వరప్రసాద్‌ను సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ఉద్యోగిలో ప్రావీణ్యత ఉంటేనే తగిన గుర్తింపు లభిస్తుందని, సీనియర్ ఉద్యోగుల నుండి ప్రతి విషయాన్నీ అవగతం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ తోట లీలాశంకర్ సత్య వరప్రసాదు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రెవెన్యూ శాఖలో టైపిస్టుగా చేరి 37 సంవత్సరాలు వివిధ హోదాల్లో పనిచేసి జిల్లా కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమని పలువురు వరప్రసాదును ప్రశంసించారు. కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింటు కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య, కలెక్టరేట్ సిబ్బంది పూలమాలలు, మెమెంటోలతో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఉద్యోగికి నైపుణ్యత ఉంటేనే గుర్తింపు వస్తుందన్నారు. సీనియర్ ఉద్యోగుల నుండి డ్రాఫ్టింగ్, రిపోర్ట్‌లు తయారు చేయటం తదితర విషయాలను శ్రద్ధగా నేర్చుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ సీనియర్ ఉద్యోగులు తన వద్ద పని చేస్తున్న కింది ఉద్యోగులకు అన్ని విషయాలు నేర్పించాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు, కలెక్టరేట్ ఎఒ పి.పాపారావు, ఎన్నికల సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, ల్యాండ్ సూపరింటెండెంట్ సిహెచ్.రవికుమార్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, సిబ్బంది పాల్గొన్నారు.



రామ సత్యనారాయణను సత్కరిస్తున్న సభ్యులు

సినీ నిర్మాత తుమ్మలపల్లికి సత్కారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఏ బ్యాక్ గ్రౌండ్ లేకుండా సినీ నిర్మాణ రంగంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న సినీ నిర్మాత తుమ్మలపల్లి రామా సత్యనారాయణ అని, 116 చిత్రాలను నిర్మించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో పేరు నమోదు కావడం గొప్ప విషయమని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బోండా రాంబాబు, పిఆర్ఒ భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఓలేటి శ్రీనివాస గుప్తా, జూలూరి రాజా అన్నారు. భీమవరం విచ్చేసిన తుమ్మలపల్లిని మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమవరంలో జరిగే మావుళ్లమ్మ జాతర, సంక్రాంతి సంబరాలకు సినీ నటులను తీసుకురావడంలో రామ సత్యనారాయణ ప్రధాన పాత్ర పోషిస్తారన్నారు. వర్ధమాన కళాకారులకు ఆయన ఒక ఆశాకిరణమన్నారు. కార్యక్రమంలో కనగర్ల రామకృష్ణ, బొండాడ బంగారురాజు, చవ్వ భామకృష్ణ మూర్తి, కురిశెట్టి శ్రీనివాస అప్పారావు, కొల్లేపర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

ఊరటనిస్తున్న చలివేంద్రం

ప్రజాశక్తి - పెనుమంట్ర

రోహిణీ కార్తెలో ఎండ మండిపోతోంది. అయితే దాహంతో ఉన్న బాటసారులకు మార్టేరులోని చలివేంద్రం ఊరట కలిగిస్తోంది. మండలంలోని మార్టేరు, నెగ్గిపూడి, వనంపల్లి, వెలగలేరు, సత్యవరం పంచ గ్రామాలకు చెందిన రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో నెల రోజులుగా నడుస్తున్న ఈ చలివేంద్రం దాహార్తులకు సేవలు అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ వంద నుంచి రెండు వందల లీటర్ల మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సహకార బ్యాంకు సేవలో 36 ఏళ్లు

నాగేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

జిల్లా సహకార బ్యాంకింగ్ వ్యవస్థలో 36 సంవత్సరాలు వివిధ బ్రాంచుల మేనేజర్‌గా నాగేశ్వరరావు అందించిన సేవలు విలువైనవని సహకార బ్యాంక్‌ల సహాయ రిజిస్ట్రార్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మార్టేరు డిసిసిబి బ్యాంకు ఆవరణలో జరిగిన స్థానిక బ్రాంచి మేనేజర్ ఎలిపే నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ సభలో ఆయన ముఖ్య అతిథి పాల్గొని మాట్లాడారు. 1988లో పెరవలి నుండి ఉద్యగ జీవితం ప్రారంభించి, పనిచేసిన అన్ని చోట్ల వినియోగదారులు, సిబ్బంది మన్ననలు నాగేశ్వరరావు పొందారన్నారు. ఈ సభకు యలమంచిలి డిసిసిబి మేనేజర్ వెలగల నర్సిరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. సంస్థను తన ఉద్యోగ కాలం పెంచమని కోరకుండా 60 ఏళ్లకే ఉద్యోగ విరమణ చేసిన ఆదర్శనీయులు నాగేశ్వరరావు అన్నారు. మార్టేరు బ్రాంచి పరిధిలోని 16 సహకార సొసైటీల ప్రతినిధులు, సిబ్బంది, రైతులు, బ్యాంక్ వినియోగదారులు పలువురు పాల్గొన్నారు. అనంతరం వారంతా నాగేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు.

నక్కల కాలువ ముంపు సమస్యను పరిష్కరించాలి

రైతు సంఘాల సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - పోడూరు

జిల్లాలో ప్రధాన మురుగు కాలువ అయిన నక్కల కాలువ ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని బాధిత గ్రామాల రైతులతో జరిగిన రైతు, కౌలురైతుల సంఘాల సమావేశం డిమాండ్ చేసింది. నక్కల కాలువ ముంపు సమస్యను పరిష్కరించాలని మండలంలోని వద్దిపర్రు గ్రామంలో రైతాంగ సమావేశం రైతు పెన్మెత్స రామభద్ర రాజు అధ్యక్షత శుక్రవారం జరిగింది. సమావేశానికి పోడూరు, యలమంచిలి, ఆచంట మండలాల్లో పలు గ్రామాల నుంచి రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిశెట్టి రామాంజనేయులు, నాయకులు కేతా గోపాలన్ మాట్లాడారు. నక్కల కాలువ ముంపు సమస్య వల్ల ఏటా వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు, కౌలురైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం వడ్డిలంక వద్ద స్లూయిస్ ఆధునికీకరించాలని, కోట్లాది రూపాయలతో నిర్మించి నిరుపయోగంగా ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ఉపయోగించి వరద సమయంలో ముంపునీరు బయటకు తోడేలా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పలువురు కౌలు రైతులు మాట్లాడుతూ ఏటా నాట్లు వేశాక మునక వస్తుందని, ఎకరాకు రూ.40 వేల వరకూ పెట్టుబడి పెట్టి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యను పరిష్కరించే వరకు పోరాటం చేయాలని సమావేశం తీర్మానించింది. రైతులు కడలి మోహన్, జడ్డు బదరీ నారాయణ, గాజులపాటి వెంకటరత్నం, బొర్రా నాగేశ్వరరావు,పల్లి జార్జి బాబు, కాండ్రేగుల హరిబాబు, శీలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఆర్‌ఎంగా వరప్రసాద్

వీరయ్య చౌదరి ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్



వరప్రసాద్

ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్య చౌదరి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారిగా పనిచేస్తున్న ఎన్‌విఆర్ వరప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. భీమవరం జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో ఆయన వీరయ్య చౌదరి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీరయ్య చౌదరిని విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.గోపీనాథ్ రెడ్డి, ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్, ఉమ్మడి జిల్లా డిపో మేనేజర్లు, అసోసియేషన్‌ల నాయకులు ట్రాఫిక్ సూపర్‌వైజర్లు మెకానికల్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది డిపోలో జరిగిన అభినందన సభలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ ఎల్.గీతావాణి, ఉమ్మడి జిల్లా కమర్షియల్ మేనేజర్ సుబ్బారావు, అకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఎస్ వి రావు పాల్గొన్నారు.

సాధారణ ఫీజులతో అసాధారణ ఫలితాలు

వాణీ పబ్లిక్ స్కూల్ సొంతం

వాణీ పబ్లిక్ స్కూల్

స్కూల్ డైరెక్టర్లు వాణీ, కృష్ణ

స్కూల్ డైరెక్టర్లు వాణీ, కృష్ణ

ప్రజాశక్తి- తాడేపల్లిగూడెం

మేఘనా రమ్యశ్రీ

సాధారణ ఫీజులతో అసాధారణ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న విద్యాసంస్థ వాణీ పబ్లిక్ స్కూల్ అని స్కూల్ డైరెక్టర్లు వాణీ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందిస్తున్నామని తెలిపారు. ఉత్తమ విద్యాబోధన, విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 1991లో వాణి ఎడ్యుకేషనల్ సొసైటీని ప్రారంభించామని తెలిపారు. ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో వారిని దానికి అణుగునంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. 33 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో వాణి పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థులు ఎందరో శాస్త్రవేత్తలుగా, డాక్టర్లుగా, లెక్చరర్లుగా, ప్రొఫెసర్లుగా తదితర ఉన్నత స్థానాల్లో ఉండడం స్కూల్‌కు గర్వకారణమని తెలిపారు. 2024 పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో వాణి విద్యార్థిని ఉప్పు మేఘనా రమ్యశ్రీ 591 మార్కులు సాధించి పట్టణంలోనే ఉత్తమ ప్రతిభ కనబర్చిందన్నారు. అలాగే 14 మంది విద్యార్థులకు 500లకుపైగా మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంఇఒ-1 వి.హనుమ, ఎంఇఒ 2 పి.జ్యోతి సుధాకర్ అభినందించారు. తమ విద్యార్థులు చదువుతోపాటు ఇప్పటికే జాతీయ, రాష్ట్ర స్థాయిలో క్రికెట్, గర్ల్స్ క్రికెట్, అథ్లెటిక్స్, ఛెస్, ఫుట్‌బాల్, స్కేటింగ్, స్విమ్మింగ్ తదితర రంగాల్లో అనేక మెడల్స్ సాధించడం గర్వకారణం అన్నారు. వాణి విద్యా సంస్థతోపాటు 2013లో వాణి సేవా సంస్థను స్థాపించి తద్వారా అనేకమంది పేద విద్యార్థులకు రాయితీ కల్పిస్తూ, అనేక సేవా కార్యక్రమాల్లో తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తున్నామని తెలిపారు.

స్కూల్ ప్రత్యేకతలు..

- అతి తక్కువ ఫీజులతో అత్యున్నత ప్రమాణాలతో విద్యా బోధన
- అనుభవజ్ఞులైన బోధనా సిబ్బందితో తరగతుల నిర్వహణ
- చదువుతోపాటు విద్యార్థులను ఛెస్, క్రికెట్, ఫుట్బాల్, స్కేటింగ్ తదితర అనేక క్రీడల్లో తీర్చిదిద్దడం
- ప్రతి విద్యార్థి పట్లా వ్యక్తిగత శ్రద్ధ వహించడం
- విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన
- స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్‌లో ప్రత్యేక శిక్షణ
- ఫ్రూట్స్ డే, వెజిటబుల్స్ డే, సైన్స్ ఫెయిర్ తదితర ఈవెంట్స్ నిర్వహణ
- క్షేత్రస్థాయి పరిశీలన (ఫీల్డ్ ట్రిప్స్)తో విద్యార్థులకు అవగాహన

పొగాకు వాడకాన్ని నిషేధించాలి

ప్రజాశక్తి - ఉండి

ఉండి : ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

పొగాకు వాడకాన్ని నిషేధించాలని ఉండి పిహెచ్‌సి డాక్టర్ బి.సాయి చంద్ర, డాక్టర్ పి.లక్ష్మీసునంద ఆధ్వర్యంలో పిహెచ్‌సి సిబ్బంది అవగాహనా ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 31న ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏటా మాసోత్సవాలు నిర్వహించి పొగాకు, వాటి ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పొగాకు వాడకం వల్ల నష్టాలు అధికంగా ఉంటాయని, అవయవాలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు పిహెచ్‌సి డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో దగ్గులూరు సచివాలయం వద్ద ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపులో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంలో డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను ఉపయోగించడం వల్ల నోటి కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్, గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ పి.ఎలిజిబెత్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కాళ్ల : పొగాకు ఏ రూపంలో తీసుకున్నా నష్టమే అని, శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని వైద్యాధికారి డాక్టర్ ఎస్.సునీల్ అన్నారు. కాళ్ల పిహెచ్‌సి అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. కాళ్ల ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.సునీల్ మాట్లాడుతూ పొగాకు వల్ల ఊపిరితిత్తులకు ముప్పు వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ డి.విజయవతి, ఎంపిహెచ్ ఇఒ పాల్సన్, పిహెచ్ ఎన్.ఛండీ రాణి పాల్గొన్నారు.

గణపవరం : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం కాశిపాడులో పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె. పరమేశ్వర్లు మాట్లాడుతూ పొగాకు తీసుకోవడం వల్ల మెదడు, గుండె, ఊపిరితిత్తుల్లో రక్తప్రసరణ తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్మెంట్ సభ్యులు నామాలరాజు, పిఎంపి సభ్యులు ఎం.శ్రీనివాసు, ఎస్.ఆంజనేయులు పాల్గొన్నారు. గణపవరం పిహెచ్‌సిలో ధూమపానం వద్దు జీవితమే ముద్దు అంటూ సిబ్బందిచే డాక్టర్ సంతోష్ కుమార్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు, హెచ్‌విసి హెచ్.పద్మజ పాల్గొన్నారు.

నరసాపురం : పొగాకు వినియోగం ఆరోగ్యానికి హానికరమని ఎన్‌టిఆర్ కాలనీ యుపిహెచ్‌సి డాక్టర్ పి.సోనియా అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని ఎన్‌టిఆర్ కాలనీ యుపిహెచ్‌సిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సోనియా మాట్లాడారు. పొగ తాగడం, పీల్చడం ఆరోగ్యానికి హానికరం అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాటకాలతోనే సమాజంలో మార్పు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మూల్యం నాటకంలో ఒక సన్నివేశం

నాటికలను బతికించుకుందామని, నాటకాలతోనే సమాజంలో మార్పు వస్తుందని పలువురు వక్తలు అన్నారు. భీమవరం డిఎన్ఆర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో చైతన్య భారతి 17వ జాతీయస్థాయి సాంఘిక నాటక పోటీలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, రంగస్థల నటులు డాక్టర్ పురాణం రామ్‌కుమార్, జనాబ్ ఎస్ఎం.భాషా మాట్లాడుతూ కళాభిమానులు, కళాకారులు పెరిగారని, చూసే వారే సంఖ్య మాత్రం తగ్గుతోందని, తెలుగు కళలను, సాహిత్యాలను అందరూ ఇష్ట పడతారని తెలిపారు. నాటకాలు సమాజంలో చైతన్యం తీసుకురావడానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. నాటకాల వైభవాన్ని తీసుకురావడానికి ఈ పోటీలను గత 16 ఏళ్లుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షులు రాయప్రోలు మాట్లాడుతూ నాలుగు రోజులపాటు ఈ పోటీలను నిర్వహిస్తున్నామని, జూన్ 2 వరకూ జరుగుతాయని, 4 రోజుల్లో 9 నాటికలను ప్రదరిస్తున్నామని అన్నారు. అనంతరం సినీ నిర్మాత తుమ్మలపల్లికి ఆత్మీయ చైతన్య పురస్కారం, రంగస్థల నటులు పురాణానికి జవ్వాది రంగస్థల చైతన్య పురస్కారం, రంగస్థల నటులు భాషాకు మైనంపాటి శ్రీరంగ నాయకులు రంగస్థల చైతన్య పురస్కారాలతో సత్కరించారు. గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి 'మూల్యం' నాటకం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో డిఎన్ఆర్ కళాశాల పాలకవర్గ జాయింట్ సెక్రటరీ కూనపరాజు రామకృష్ణంరాజు, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, పిఆర్ఒ భట్టిప్రోలు శ్రీనివాస్, వడుపు గోపి పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 29 మంది విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక బిఆర్ఆర్ అండ్ జికెఆర్ ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం సినర్జిన్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఈ ఎంపికలో 42 మంది విద్యార్థులు హాజరయ్యారు. 29 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి జీతం ఇతర ఎలివెన్స్ కలిపి నెలకు రూ.15,000 ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు ఆఫర్ లెటర్స్ అందించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు మాట్లాడుతూ క్రమశిక్షణ, లక్ష్య నిర్దేశం, సమయ స్ఫూర్తితో మెలిగి ఇంటర్వ్యూల్లో పాల్గొనాలన్నారు. ఐ మార్క్యు కంపెనీ హెచ్ఆర్ బాజీ అభ్యర్థులకు గ్రూప్ డిస్కర్షన్, ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్మెంట్ ఇన్‌ఛార్జి కె.లక్ష్మణరావు, కళాశాల ట్రైనర్ కె సంతోష్ ప్రసాద్ పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన పాలకొల్లు ఛాంబర్స్ కళాశాల విద్యార్థులు

చురుగ్గా ఒఎన్‌జిసి పైప్‌లైన్ పనులు

ప్రజాశక్తి - నరసాపురం

సీతారామపురం సౌత్, వైఎస్‌పాలెం, రుస్తుంబాద మూడు గ్రామాలను అనుసంధానం చేస్తూ 1.5 కిలో మీటర్ల మేర చేపట్టిన ఒఎన్‌జిసి పైపులైన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సీతారామపురం సౌత్ గ్రామంలోని ఒఎన్‌జిసి బావి నుంచి నర్సాపురం ప్రధాన కార్యాలయం 4వ నంబర్‌కు కలుపుతూ పైప్‌లైన్ పనులు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు, నరసాపురం డిఎస్‌పి, ఒఎన్‌జిసి అధికారుల పర్యవేక్షణలో పనులు వేగవంతంగా సాగుతున్నాయి.

పనులు చేపడుతున్న ఒఎన్‌జిసి సిబ్బంది

నేటి నుంచి ఐద్వా రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - నరసాపురం

ఐద్వా రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు జూన్ 1, 2, 3 తేదీల్లో నరసాపురం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరగనున్నట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి, అధ్యక్షురాలు పొగాకు పూర్ణ, కేతా పద్మజ తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ శిక్షణ తరగతులకు ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, కార్యదర్శి డి.రమాదేవి, అంగన్‌వాడీ ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ హాజరుకానున్నారని తెలిపారు.

కృష్ణ నటన అద్భుతం

ప్రజాశక్తి - పెనుమంట్ర

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో సాహసంగా అల్లూరి సీతారామరాజు సినిమా నిర్మించి హీరో కృష్ణ అజరామరమైన కీర్తిని పొందారని మండల కృష్ణ ఫాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జక్కు శక్తి నారాయణ అన్నారు. శుక్రవారం సంఘం సభ్యులు హీరో కృష్ణ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అభిమానులు కె.వెంకటరావు, కేశవస్వామి, పి.అప్పారావు, జె.రాజారావు పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం వద్ద జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో వివిధ పాఠశాలల నుంచి అనేక మంది పిల్లలు పాల్గొంటున్నారు. గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు నేర్చుకుంటున్న అంశాలపై శుక్రవారం పరీక్ష నిర్వహించగా, సుధీర్ మోహన్, జీవన్‌కుమార్ పర్యవేక్షించారు. అనంతరం శాస్త్రవేత్త సుబ్బారావు సర్ ఆర్థర్ కాటన్ జీవిత చరిత్రను వివరించారు. అలాగే డొక్కా సీతమ్మ సేవలను వివరించారు. ఆర్టిస్ట్ శ్రీనివాస్ డ్రాయింగ్ క్లాస్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ మాస్టారు, సూర్యంబాబు, ప్రవీణ్, మనోజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

5, 6, 7 తేదీల్లో విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

రానున్న సార్వా సీజన్ వరి సాగు కోసం ఈనెల ఐదో తేదీ నుంచి మూడు రోజులు ఉదయం 8 గంటల నుండి రైతులకు విత్తనాలు అందించడం జరుగుతుందని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (మార్టేరు) పరిశోధనా సహ సంచాలకులు డాక్టర్ ధన్యంరాజు శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక పరిశోధన స్థానంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 5వ తేదీన విత్తన దినోత్సవం సందర్భంగా పంపిణీ ప్రారభించి 5, 6, 7 తేదీలు మూడు రోజులు కొనసాగిస్తామని అన్నారు. పడిపోని స్వర్ణగా పేరు తెచ్చుకున్న ఎంటియు 1318 ఫౌండేషన్, సత్యప్రమాణ విత్తనాలు 15 వందల క్వింటాళ్ల మేరకు కావాల్సిన మేరకు రైతులకు సరఫరా చేస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన శాస్తవేత్త డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

145 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తణుకు

డాక్టర్ వివిఎస్ఎన్.రాజు (ఎక్స్ మిలటరీ) ఆధ్వర్యంలో టోరంటో ఫార్మా సిగ్మా డివిజన్ సౌజన్యంతో శుక్రవారం స్థానిక సత్యనారాయణ నర్సింగ్ హోమ్‌లో ఆర్థోపెడిక్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 145 మంది రోగులకు ఎముకల దృఢత్వం (బిఎండి) పరీక్షలు నిర్వహించారు. రాజు ఆర్థిక సౌజన్యంతో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కీళ్ల నొప్పుల బారిన పడకుండా ఆయన పలు సూచనలు ఇచ్చారు. రోగులకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో వి.శ్రీనివాసరాజు, అమూల్య మెస్ ప్రొప్రయిటర్ సిహెచ్.సత్యనారాయణరాజు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
విలేకరులు కావలెను
మీరు జర్నలిస్టు కాదలచుకున్నారా?
మీకు సామాజిక స్పృహ ఉన్నదా?
విన్నదీ కన్నదీ పది మందితో పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
నూజివీడు, తాడేపల్లిగూడెం టౌన్, భీమవరం అర్బన్, కైకలూరు టౌన్
విలేకర్లు కావలసిన రూరల్ కేంద్రాలు
వేలేరుపాడు, లింగపాలెం, పెదవేగి, దెందులూరు, పెదపాడు, నిడమర్రు, గుడివాకలంక (ఏలూరు), భీమవరం, నరసాపురం, అత్తిలి, ఇరగవరం, పెంటపాడు, కైకలూరు, జంగారెడ్డిగూడెం, మొగల్తూరు
విలేకర్లకు అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
ఇంటర్వ్యూ : తేది: 01-06-2024 శనివారం ఉదయం 9.30 గంటల నుండి
ఆఫీసు చిరునామా: ప్రజాశక్తి కార్యాలయం, బొలుసువారి వీధి, ఏలూరు టైమ్స్ కార్యాలయం సమీపంలో, పవర్‌పేట, ఏలూరు-2
సంప్రదించాల్సిన నెంబర్లు 99493 66196, 89191 70815, 94900 99168

శివాలయం సెంటర్లో మున్సిపాల్టీ వారు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

ఎక్కువ పన్ను వసూలు చేస్తే ఫిర్యాదు చేయండి

మున్సిపల్ షాపుల వద్ద నంబర్లతో ఫ్లెక్సీలు ఏర్పాటు

ప్రజాశక్తి - నరసాపురం

రోజువారీ మార్కెట్లలో పన్నులు వసూలు చేసుకునేందుకు ఏటా మున్సిపాల్టీ పాట నిర్వహిస్తోంది. రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే వారి దగ్గర నుంచి పాటదారులు పన్నులు వసూలు చేస్తుంటారు. అయితే మున్సిపాల్టీ నిర్దేశించిన ధరల కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారని చిరు వ్యాపారుల నుంచి ఫిర్యాదులు రావడంతో దాన్ని అధిగమించేందుకు అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఏ షాపు నుంచి ఎంత వసూలు చేయాలనే వివరాలతో బోర్డులు ఏర్పాటు చేశారు. పాటదారులు ఎక్కువ సొమ్ము డిమాండ్ చేస్తే 9849907188, 83097 65044 ఫోన్ చేయాల్సిన నంబర్లు కూడా ఈ బోర్డులపై రాశారు. దీనివల్ల ఎక్కువ వసూలుకు అవకాశం ఉండదని, అధికారులు భావిస్తున్నారు. బస్టాండ్ సెంటర్, శివాలయం, చేపల మార్కెట్‌లో ఈ బోర్డులు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఎక్కువ వసూళ్లపై ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ

ప్రజాశక్తి - తణుకు

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) మధ్యాహ్న భోజన కార్మికులకు మండలస్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారి-2 వి.హైమావతి ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పిపిటిలను స్టార్ టివిల ద్వారా వివరించారు. మధ్యాహ్న భోజన పథకం వీడియోలు చూపించి ప్రతి వంటకం ఎలా చేయాలో వివరించారు. పోషకాహారం, న్యూట్రిషన్ గురించి వివరించారు. అనంతరం కుక్, హెల్పర్స్ వర్కర్స్ వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెయినిగా ఎకె.సరళ, అసిస్టెంట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కె.పద్మావతి, ఆర్‌పిగా పెదపాటి గోపాలకృష్ణ శిక్షణ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిఎంఒ విజిటింగ్ ఆఫీసర్‌గా ఎ.కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సభలు, సమావేశాలు నిర్వహించొద్దు : సిఐ

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు : గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సభలు, సమావేశాలు నిర్వహించకూడదని సిఐ కె.గోవిందరాజులు ప్రజలకు సూచించారు. శుక్రవారం రాత్రి మొగల్తూరులో ఎస్ఐ కె. వెంకటరమణ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల ఆరో తేదీ వరకూ కోడ్ అమల్లో ఉంటుందని, నిబంధనలను అందరూ కచ్చితంగా పాటించాలని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గణపవరం: గ్రామాల్లో ఎన్నికలకు సంబంధించి ఏదైనా గొడవ జరిగితే ఘర్షణకు కారణమైన వారిపై నాన్ బెయిల్ బుల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కాశిపాడు, చిలకపాడు, డికె వల్లి, అప్పన్నపేట, జల్లికాకినాడ గ్రామాల్లో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల ఫలితాల సందర్భంగా రాజకీయ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఒకరిపై ఒకరు ఇటువంటి కవ్వింపు చర్యలు చేయకూడదని అన్నారు. ఆ విధంగా గొడవపడితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.